# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికాప్రకటన-2 తేది. 02-11-2014

దేశంలో రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలంటే విదేశాల నుంచి ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసుకోవడం ఆగిపోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. ఈ దిశలో కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఛత్తీస్ గఢ్ పర్యటలో ఉన్న ముఖ్యమంత్రి ఆదివారం బెమెత్ర జిల్లా కోహడియా గ్రామంలో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసిఆర్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంట పండించినప్పటికి వాటికి గిట్టుబాటు ధర రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చైనా లాంటి దేశాలు వ్యవసాయంలో అధిక ఉత్పత్తులు సాధించి మనలాంటి దేశాలకు ఎగుమతి చేయడం వల్ల ఇక్కడి రైతుల పంటకు సరి అయిన ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి తొలగి పోవాలంటే మన దేశంలో పండే ఆహార ధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతి ఆగిపోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఓ వైపు ఆహార ధాన్యాల కొరత ఉందని, మరో వైపు రైతులు పండించిన పంటకు సరైన ధర రావడం లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, ఆధునిక వ్యవసాయ పద్దతులు అవలంభించి ఛత్తీస్ గఢ్ రైతులు అధిక ఉత్పత్తులు సాధిస్తున్నారన్నారు. ఇంకా కేసిఆర్ చెప్పిన విషయాలు ఆయన మాటల్లోనే... ఇలా ఉన్నాయి. నేనూ రైతుబిడ్డనే, నేనూ రైతునే తెలంగాణలోని మెదక్ జిల్లాలో నేను వ్యవసాయం చేస్తున్నాను. తెలంగాణ ఉద్యమంలో ఉండగా ఛత్తీస్ గఢ్‌లో ఆధునిక వ్యవసాయం ద్వారా ఉత్పత్తులను పెంచిన వి.ఎన్.ఆర్. సీడ్స్ రీసర్చ్ గురించి

విన్నాను. ఈ కంపెనీ ఎండి విమల్ చౌదాను స్వయంగా నా వ్యవసాయ క్షేత్రానికి ఆహ్వానించాను. అప్పుడే చెప్పాను. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఖచ్చితంగా ఛత్తీస్ గఢ్ వచ్చి అక్కడి వ్యవసాయాన్ని ప్రత్యక్షంగా చూసి ఆ పద్ధతులను మా తెలంగాణ రైతులకు వివరిస్తానని చెప్పాను. తెలంగాణలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నది నా సంకల్పం. మా రైతులను లాభసాటి వ్యవసాయం చేసే వారిగా తీర్చదిద్దాల్సిన బాధ్యత నాపై ఉంది. మా తెలంగాణ నేలల్లో బంగారు పంటలు పండాలి. అందుకోసం ఇక్కడికి వచ్చి కొన్ని పద్ధతులైనా నేర్చుకొని పోవాలని అనుకున్నాను. అందుకే వచ్చాను. ఇక్కడ రైతులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. నమ్మ శక్యం కాని విధంగా దిగుబడులు సాధిస్తున్నారు. మీతో జరిపిన సంభాషణల్లో ఒకరు ఎకరానికి 80 టన్నుల కాప్సికం పండించినట్లు, మరోకరు ఎకరానికి 420 క్వింటాళ్ల మిర్చి పండించినట్లు విని ఆశ్చర్యపోయాను. ఇజ్రాయిల్ దేశంలో కుడా ఈలాగే మంచి ఉత్పత్తులు వస్తాయి. మనకన్నా ఎన్నో రేట్ల ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. ఎడారి ప్రాంతమైనా సరే అక్కడ గొప్పగా వ్యవసాయం సాగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ ఉన్న కట్ ఫ్లవర్ 90 శాతం అక్కడి నుండే ఎగుమతి అవుతున్నది. చైనా కూడా మెరుగైన ఉత్పత్తులు సాధిస్తున్నది. ఛత్తీస్ గఢ్ రైతులు కూడా ఆ బాటలోనే ప్రయాణం చేస్తున్నారు. మా తెలంగాణలో కూడా నిజామాబాద్ జిల్లా అంకాపూర్ రైతులు వ్యవసాయంలో అధ్భుతాలు సృష్టిస్తున్నారు. ఐక్యంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈలాంటి పరిస్థితే దేశమంతా రావాలి. నేను సిద్ధిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మా ప్రాంత రైతులను అంకాపూర్ పంపించాను. ఇప్పుడు తెలంగాణ రైతులను బృందాలుగా ఛత్తీస్ గఢ్ పంపుతాను. ఇక్కడి రైతులు అవలంభిస్తున్న పద్ధతులను వారు చూడాలి. దేశంలో మరో హరిత విప్లవం రావాలి. ఉత్పత్తులు పెరుగుతున్నాయి కాని ఉత్పాదకత పెరగడం లేదు. ఈ విషయంలో రైతులు ఆలోచించుకోవాలి. ఎక్కడికక్కడ రైతులు సంఘటితం కావాలి. ఐక్యంగా వ్యవసాయం చేయాలి. అందరికి సంఘాలు ఉంటాయి కాని, రైతులకు సంఘాలు

ఉండవు. వారు పండించిన పంటకు సరైన ధర వచ్చేది నమ్మకమే లేదు. ఈ పరిస్థితి పోవాలంటే అటు ప్రభుత్వం నుండి కొంత సహకారం అందాలి, ఇటు రైతుల దృక్పథంలో కూడా మార్పు రావాలి. కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యాల దిగుమతులను నిరోధించాలి. మన దగ్గర దొరకని ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే నష్టం లేదు. కాని మన దగ్గర రైతులు పండించే పంటలను కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడి రైతులు నష్ట పోతున్నారు. ఛత్తిస్ గఢ్ రైతులు గ్రీన్ హౌజ్, పాలి హౌజ్ కల్టివేషన్ ద్వారా, బింధు సేధ్యం ద్వారా ఎంతో ప్రగతి సాధిస్తున్నారు. మీరు మరింత ఎదగాలని నేను మనసారా కోరుకుంటున్నాను. రాయ్‌పూర్ లో ఇంటర్నేషనల్ ఫ్లైట్స్, కార్గోలు వచ్చే ఏర్పాటు చేసుకోవాలి. మీ ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా అందించాలి. ఆహార ధాన్యాల కొరత, పంటలు సాగుచేసే అవకాశం లేని ప్రాంతాలకు ఛత్తిస్ గఢ్, తెలంగాణ లాంటి రాష్ట్రాల నుండి వ్యవసాయం ఉత్పత్తులు ఎగుమతి కావాలి. అంతే తప్ప విదేశాల నుంచి దిగుమతి కావద్దు. చైనా నుండి పెద్ద ఎత్తున పత్తి దిగుమతి కావడం వల్ల ఇక్కడ మన రైతులు నష్టపోతున్నారు. చివరికి వ్యవసాయం దండగ అని భావించి, ఈ రంగం నుండే తప్పుకోవలసిన పరిస్థితి వస్తోంది. అలాంటి వారికి మీలాంటి రైతులు స్ఫూర్తి కావాలి. తెలంగాణలో కుడా బింధు సేధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాము. పైలట్ ప్రాజెక్టుగా లక్షా 30 వేల ఎకరాల్లో ఈసారి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలు పండిస్తాము. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుచేసుకోవడానికి ఎస్సీ,ఎస్టీలకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీలు ఇస్తాము. గ్రీన్ హౌజ్ కల్టివేషన్ ను కూడా ప్రోత్సహిస్తాము. ఐక్యంగా వ్యవసాయం చేయడం, పరస్పర అవగాహన, అనుబంధంతో ముందుకు పోవడం, సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించుకోవడం, ఆధునిక పద్దతులను అందిపుచ్చుకోవడం లాంటి ప్రగతిశీల లక్షణాలు ఛత్తిస్ గఢ్ రైతులను ఉన్నత స్థానంలో నిలిపాయి. ఈ స్ఫూర్తి దేశమంతా విస్తరించాలి.

నేను వాస్తవానికి ఛత్తిస్ గఢ్ లో విద్యుత్ కొనుగోలు చేసి మా రైతులకు అందించాలని వచ్చాను. ఛత్తిస్ గఢ్ లో 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నారు. కాని మా దగ్గర ఆ పరిస్థితి లేదు. మూడేళ్లలో దాదాపు 16,000 మేగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాము. ఆ తరువాత మేము కూడా 24 గంటల విద్యుత్ ఇస్తాము. మా కల సాకారమయ్యేలా దీవించమని దేవున్ని ప్రార్థిస్తున్నాము. ప్రస్తుతానికి కష్ట కాలంలో ఉన్న మమ్మల్ని ఆదుకోమని మీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌ను అభ్యర్థించాము. అండగా ఉంటామని మాటిచ్చారు. మీ దగ్గరి నుండి 1000 మెగావాట్ల విద్యుత్ ను కొనుగోలు చేస్తున్నాము. అంత కన్నా ఒక రోజు ముందుగానే మీ రైతుల నుండి ఎంతో నేర్చుకుని వెళుతున్నాము. కరెంట్ ఒక్కటి అందుబాటులో వుంటే తెలంగాణలో కూడా రైతులు బాగుపడతారు. తెలంగాణలో సమశీతోష్ణ వాతావరణ పరిస్థితులు, విభిన్న స్వభావం కలిగిన నేలలు, మంచి వర్షపాతం ఉన్నాయి. ఇవన్నీ వ్యవసాయానికి, విత్తనోత్పత్తికి ఎంతో సానుకూల అంశం. మా తెలంగాణను భారత దేశ విత్తన భాండాగారంగా మారుస్తాము. మా తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో లక్ష ఎకరాల్లో వరి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నాము. ఛత్తిస్ గఢ్ లో కూడా వరి సాగుకు మా దగ్గరి నుండి విత్తనాలు తెచ్చి వాడుతున్నారు. తెలంగాణ, ఛత్తిస్ గఢ్ ల మధ్య కేవలం గోదావరి నది మాత్రమే అడ్డుగా ఉన్నది. సంస్కృతి, నాగరికత, జీవన విధానంలో రెండూ ఒక్కటే. కాకతీయుల కాలంలో ఈ రెండు ప్రాంతాలు ఒకే రాజ్యంలో ఉన్నాయి. కాకతీయుల వంశీయులు ఛత్తిస్ గఢ్ లోనే ఉంటున్నారు. భవిష్యత్తులో కూడా మన రెండు రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాలి.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాగా ఎమ్మెల్యే లాబ్ చంద్ బఫ్నా మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రిని రాష్ట్రావతరణ దినోత్సవాల సందర్భంగా వచ్చిన ఆత్మీయ అతిథిగా సంభోదించారు. తెలంగాణ ముఖ్యమంత్రికి మా భాష

అర్థం కాదు అనుకున్నానని, హిందిలో మాట్లాడలేడు అనుకున్నానని అన్నారు. కాని కేసిఆర్ చాలా గొప్ప హింది మాట్లాడారని ప్రశంసించారు. మాతృభూమి విముక్తి కోసం కేసిఆర్ నడిపిన మహోధ్యమాన్ని తాము చూశామన్నారు. మరో ఎమ్మెల్యే సావల్ రామ్ దేహరే తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, అక్కడి కలెక్టర్, ఎస్పీలు పాల్గొన్నారు.

ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, వేణుగోపాలచారి, నర్సింగరావు, తదితరులు కూడాపాల్గొన్నారు.

-----------------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం